




రాత్రి ఎనిమిది అవస్తోంది. రామ్మూర్తి భార్యా పిల్లలతోసహా బీచ్‌కి వెళ్ళి అప్పుడే ఇంటికి తిరిగివచ్చాడు. అందరూ ముందుహాల్లో కూర్చున్నారు. ఫ్లోరసెంటు దీపం వెలుగుతోంది పిల్లలు రామ్మూర్తిని చుట్టేశారు. భార్య కమల దూరంగా ఒక పేముకుర్చీలో కూర్చునివుంది. ఆమె పక్కనే రామ్మూర్తి అత్తయిన రత్తమ్మ చాపమీద కూర్చొని కాఫీగింజలతో పొరబాటున కలిసిపోయిన బరాడీలను విడదీస్తోంది.

రామ్మూర్తి మధ్యతరగతి మనిషి. నెలకి అయిదువందల రూపాయలు గడిస్తున్నాడు. దానితో లేదనకుండా తృప్తి

కరంగా సంసారాన్ని సాగిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు—సమీపంలోవున్న స్కూల్లో చదువుకుంటున్నారు ఆఖరిపాతురు రమకి ఇంకా అయిదోఏడు దాటలేదు

'నాన్నా' రేపు సినిమా," అంది రమ ముద్దుగా ఆ మాటలు వినగానే మర్నాడు ఆదివారమని అతడికి జ్ఞాపక మొచ్చింది ఆదివారం పొద్దుట మద్రాసులోని కొన్ని థియేటర్లలో తెలుగుసినిమాలు ప్రదర్శిస్తూవుంటారు అప్పుడప్పుడూ అతను వాళ్ళను సినిమాలకు తీసుకువెళ్తూంటాడు

"రేపు మంచి సినిమా ఏముందో చెప్పండి,'' అన్నాడు రామ్మూర్తి

"వినాయకచవితి బాగుంటుందేమో!" అంది కమల.

''ఉష్, ఈ రోజుల్లో పౌరాణిక చిత్రాలు ఎవరిక్కావాలి ?'' అన్నాడు రామ్మూర్తి, విసుగ్గా

"మీరు సినిమాకి వెళ్తే వెళ్ళండి; నేను మాత్రం రాను,'' అంది తార.

రామ్మూర్తి తన పెద్దకుమార్తె తార వైపు క్షణకాలం చూశాడు.

''ఎప్పటినుంచీ ఈ సినిమాసన్యాసం అవలంబించావు, తారా ?" అడిగాడు రామ్మూర్తి.

''సన్యాసం కాదు, నాన్నా! నే నొక పుస్తకాల పెట్టె కొనుక్కొంటాను అందుకని......"

"ఎందు కది ?" అడ్డొస్తూ అడిగాడతను.

"పుస్తకాలు పెట్టుకోడానికి, నాన్నా' సంచిలో పెట్టుకుంచే పుస్తకాలు పోతున్నాయి ఎప్పుడేనా వర్షం వస్తే తడిసిపోతూవుంటాయి,'' అంది తార

"షియర్ వేస్ట్ ! అనవసరమైన వాటికి ఆశించకు ! విద్యార్థినులకు ముఖ్యమైనవి పుస్తకాలు, పెట్టెలు కాదు మేము చదువుకునే రోజుల్లో ఈనాడు మీరు ఉపయోగించే సంచీలుకూడా లేవు చేత్తో పుస్తకాలు పట్టుకుని స్కూలుకి వెళ్ళేవాళ్ళం ''

"ఆ పెట్టె చాలా బాగుంది, నాన్నా! సులేఖ కొనుక్కుంది, ఇవాళే చూశాను," తార ఆగింది.


"ఇంతకీ ఆ పెట్టె ఖరీ దెంత ?''

"పన్నెండు రూపాయిలు అల్యూమినం పెట్టె ''

"పన్నెండు రూపాయిలే · అటువంటి పెట్టె కొనడానికి నేను డబ్బు ఇవ్వనులే ఇహ దాన్నిగురించి మర్చిపో !' అన్నాడు రామ్మూర్తి కోపంగా

కాస్సేపట్లో అందరూ భోజనానికి కూర్చున్నారు. తార మౌనం వహించింది. తింటోంది. అందరిమాటలూ వింటోంది

ఆదివారంపొద్దుట తొమ్మిది దాటింది పిల్లలు ముస్తాబయ్యారు కమల చీర మార్చుకుంటోంది రామ్మూర్తి సిగరెట్ పీలుస్తూ హాల్లోకి వచ్చాడు.




"అందరూ సిద్ధంగా వున్నారా?'' అడిగా డతను.

"వస్తున్నాను.''అంది కమల పక్క గదిలోంచి.

రెండోకూతురు పద్మ, కొడుకు గిరీ తమ తండ్రివద్దకు పరుగెత్తుకొచ్చారు. గదిమూల నున్న తొట్టెమీద తార కూర్చుని వుంది

''తారా, నువ్వు సినిమాకి రావా?'' అడిగాడు రామ్మూర్తి.

"రాను, నాన్నా!'' అంది తార దీనంగా.

"మంచిది నాకు డబ్బుఖర్చు తగ్గుతుంది "

"నేను రాకపోతే ఎంతఖర్చు తగ్గుతుంది, నాన్నా?"అడిగింది తార తండ్రి దగ్గర కొస్తూ.

"రూపాయిన్నర అనుకో!"

''అయితే ఆ డబ్బు నాకియ్యి నాన్నా!—దాచుకొంటాను,"అంది తార.

రామ్మూర్తి కాస్సేపు కూతురువైపు చూస్తూ నిలబడ్డాడు. తార తెలివైనది మార్కులు బాగా వస్తూంటాయి డబ్బు దాచుకొంటా నన్నందుకు మెచ్చుకుంటూ రామ్మూర్తి రూపాయిన్నర తార చేతిలో పెట్టాడు. అందరూ మెట్లుదిగి బయటకు నడిచారు బాల్కనీలో నిలబడి తార వాళ్ళందరకూ నవ్వుతూ టాటా చెప్పింది

రోజులు గడిచిపోతున్నాయి. కాల

చక్రం తిరిగిపోతోంది. రెండు నెలల తర్వాత ఒక ఆదివారంనాడు అందరూ సర్కస్‌కి వెళ్ళారు. తారమాత్రం వెళ్ళ లేదు తండ్రిచ్చిన రెండురూపాయిలను తీసుకుంది ముందు వరండాలో కూర్చుని త నంతవరకూ పోగుజేసినడబ్బును తార లెక్కపెట్టసాగింది నాలుగు రూపాయిల ఇరవైఅయిదు పైసలు వుంది. తను కొనుక్కోవాలని కలలు కనే పుస్తకాల పెట్టెకీ తనకూ ఇంకా చాలా దూరం వుంది తన దీక్షను వదలకూడదని తార నిశ్చయించుకొంది. తనకు పుస్తకాల పెట్టె కావాలి దానికోసం తనెంత త్యాగ మైనా చేయగలదు.

ఆ రోజు రాత్రి అందరూ భోజనాలు చేస్తున్నారు. సర్కసు ఎంతో బాగుందని పిల్లలందరూ అమ్మమ్మతో చెపుతున్నారు.

"బెద్దమ్మలా తార ఇంట్లో కూర్చుంది!" అన్నాడు గిరి.

"ఇంట్లో ఏడుస్తూ కూర్చున్నావా?" అడిగింది రమ

"అబ్బా. దానికి ఇంట్లో ఎలా తోస్తుందో!" అంది పద్మ

"మీరందరూ చెప్పుకునే మాటలు వింటూంటే సర్కసు చూసినట్టేవుంది," అంది తార.

"బాగా చెప్పావు తారా," అన్నాడు రామ్మూర్తి.

సంవత్సరం గడిచిపోయింది. తార పాసయి పైక్లాసుకు వెళ్ళింది. ఇప్పుడు తార సంచిలో పదిరూపాయిలు ఉన్నాయి. మరో రెండు రూపాయిలు తను కూడ బెట్టగల్గితే తనకికూడా అల్యూమినం పుస్తకాల పెట్టె వస్తుంది. కాని ఈమధ్య ఎందువల్లనో పిల్లలను సినిమాలకు తీసుకువెళ్ళడంలేదు రామ్మూర్తి.

ఆ రోజు ఆదివారం. పొద్దుట ఎనిమి దవస్తోంది. రమను ఆప్యాయంగా దగ్గ రకు తీసుకుంది తార.

"ఏం చెల్లీ, మంచి సినిమా వుంది. వెళ్ళకూడదూ?" తార నవ్వుతూ ప్రోత్స హించింది.

"నాన్న నడుగుతా వుండు," అంది రమ

దినపత్రిక చదువుకుంటూన్న తండ్రి వద్దకు రమ పరుగెత్తింది రమంటే అత డికి చాలా ఇష్టం. ఇంట్లో అందరికంటె చిన్నపిల్ల, రమ, ఏదడిగినా అతను లేదన కుండా ఇస్తాడు

"నాన్నా! మంచి సినిమా ఉంది," అంది రమ.

"అయితే ఆలశ్యమెందుకూ-నన్నూ, మీ అమ్మనీ తీసుకెళ్ళు!" అన్నా డతను.

రమ తొందరగా వంటింట్లోకి పరు గెత్తింది.

"అమ్మా, నిన్ను ఇవాళ సినిమాకి తీసుకెళ్తున్నాను, రెడీగా వుండు," అంది రమ సగర్వంగా.

"అలాగేనమ్మా." అంది కమల ఇడ్లీ పచ్చడి రుబ్బుతూ ఇవంతా మౌనంగా

గమనిస్తూన్న తార లోలోపల ఆనందించింది.

తొమ్మిదిన్నరకి అందరూ సినిమాకు వెళ్ళారు. వెళ్ళేముందు పర్సులో చిల్లర లేక తారకి రెండురూపాయిలిచ్చి వుంచుకో మన్నాడు తండ్రి. తార తన అదృష్టం పండిం దనుకుంది. రామ్మూర్తి కూతుర్ని వుద్దేశించి ఇలా అన్నాడు : "తారా, ఈ డబ్బంతా ఏం చేసుకుంటావే ! నీ వయస్సులోని పిల్లలందరూ సినిమాలూ, సర్కసులూ అంటే చెవులు కోసుకుంటారు. ఇలా ముసలమ్మలా ఇంట్లో కూర్చుంటా వేమిటి ?"

"నేను పుస్తకాలపెట్టె కొనుక్కుంటా, నాన్నా! ఇవాళకి పన్నెండు రూపాయలు పోగైనాయి. మీ రందరూ తిరిగి వచ్చేసరికి నా చేతిలో పెట్టె వుంటుంది.'' అంది తార.

"వెర్రిదానా, ఆ పెట్టెకోసం ఇంత త్యాగమా !" అని రామ్మూర్తి గబగబా మెట్లు దిగాడు.

''అమ్మమ్మా !''అరిచింది తార.

''ఏమిటే ?" స్నానాల గదిలోంచి జవాబిచ్చింది రత్తమ్మ.

''నేను అలా వెళ్ళొస్తాను. తలుపు మూసుకో !"అంది తార.

డబ్బు సంచిని చేత్తో పట్టుకుని తార మెట్లుదిగి బయటకు నడిచింది. తొందరగా పేవ్ మెంటుమీద అడుగులు వేస్తోంది. పది నిముషాల్లో రాజారామ్ స్టోర్సు చేరుకుంది, క్షణకాలం తార అలాగే నిలబడిపోయింది. రాజారామ్ స్టోర్సు మూసివుంది !

ఆరోజు ఆదివారమని తారకి గుర్తొచ్చింది. తను ఎలాగైనా ఇవాళ పెట్టె కొనాలి. తార లజ్ వైపు నడవసాగింది. ఇటూఅటూ తిరిగే బస్సులను చూస్తూంటే వాటిలో ఎక్కా లనిపించింది, కాని బస్సెక్కితే టిక్కెట్ కొనాలి. సంచిలో డబ్బు తరుగుతుంది. పెట్టె రాదేమో !

బాగా ఎండగా వుంది. తార కాళ్ళు కాలుతున్నాయి. అందరికీ తండ్రి చెప్పులు కొంటూంటే తనకి వద్దంది తార. ఆ రోజు తండ్రి చెప్పులకు బదులుగా ఆమెకు మూడురూపాయ లిచ్చాడు. కాళ్ళు కాలడంవలన తార లజ్ వైపు పరుగెత్త సాగింది. ఆయాసపడుతూ, ఒగురుస్తూ ఆమె లజ్ చేరుకుంది. దాహం వేస్తోంది. కొంచం దూరంలో తెరచి వున్న ఒక షాపుమీదకు ఆమె దృష్టి వెళ్ళింది. డజను అల్యూమినం పుస్తకాల పెట్టెలు ఆ షాపులో పైనుంచి వేళ్ళాడుతున్నాయి. వాటిని చూడగానే ఆమె దాహం తీరిపోయింది. రోడ్డుదాటి తార ఆ షాపులోకి జొరబడింది. షాపు యజమాని ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

''ఆ పెట్టె ఒకటి ఇవ్వండి ఇవిగో పన్నెండు రూపాయిలు,'' అంది తార గుడ్డసంచిని అతని కందిస్తూ

అతడు సంచిని అందుకున్నాడు. అందులోని డబ్బును లెక్కపెట్టి చూశాడు.

"ఆ పెట్టె ఖరీదు పన్నెండున్నర మరో యాభై పైసలు పట్రా,'' అన్నాడతను.

తార అతనివైపు దీనంగా చూసింది. కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. ఆత్రంగా పైన వేళ్ళాడుతూన్న పెట్టెల వైపు చూస్తోంది అందీ అందని పెట్టె! మరో యాభై పైసలుంటే! ఆమె తన చూపును షాపు యజమానివైపు మళ్ళించింది

''నావద్ద ఆ సంచిలోవున్న డబ్బే వుంది. దయచేసి ఆ పెట్టె ఇవ్వండి. మరో యాభై పైసలు ఎప్పుడో అప్పుడు నేను మీకు పట్టుకొచ్చి ఇస్తాను,'' అంది తార.

షాపు యజమాని తార మొహంలోకి ముచ్చటగా చూస్తూ వుండిపోయాడు. పదకొండేళ్ళ అమ్మాయి. పొట్టిగా పచ్చగా బొమ్మలా వుంది. ఏడుస్తూన్న ఆమె మొహాన్ని చూస్తూంటే అతడికి జాలి కలిగింది క్షణంలో ఒక పెట్టెను తీసి ఆమె కందించాడు. రెండు తాళం చెవులున్న గుత్తి ఆమె కిచ్చాడు

తార పళ్ళు ఆనందంతో మెరిశాయి పెట్టెను, తాళం చెవ్వుల గుత్తని పట్టుకుని ఇంటివైపు గబగబా అడుగులు వేస్తోంది. ఎండ ఇంకా ఎక్కువగావుంది, కాని ఆమె కాళ్ళు కాలడంలేదు. ఆమెలో ఆనందం అవధులను తెంచుకుని సముద్ర కెరటాల్లా ఉరకలేస్తోంది నడుస్తూ ఆమె నలువైపులా చూస్తోంది. కళ్ళలో ఏదో నూతనకాంతి ప్రకాశిస్తోంది. పెదిమల మీద చిరునవ్వు తాండవిస్తోంది. ఏదో యుద్ధంలో విజయాన్ని సాధించిన వీరుడిలా ఆమె ఇంటికి నడుస్తోంది ఇల్లు చేరుకుంది మూసిన తలుపులను గట్టిగా తట్టింది. రత్తమ్మ తలుపు తెరవగానే తన చేతిలోవున్న పెట్టెను జయప్రదంగా చూపిస్తూ," నా పుస్తకాల పెట్టె, అమ్మమ్మా ఇప్పుడే కొన్నాను," అంది తార వణుకుతూన్న కంఠంతో.

"బాగుందమ్మా,"అంది రత్తమ్మ.

ఒంటిగంట దాటాక అందరూ సినిమా నుంచి తిరిగివచ్చారు తన పుస్తకాల పెట్టెను తార అందరకూ ఆహ్లాదంగా చూపించింది

"చివరకు సాధించావు! నీ దీక్షను మెచ్చుకొంటున్నాను. ఇంత దీక్షతో మనుషులు ఏ కార్యాన్నైనా సాధించగలరు,' అన్నాడు తండ్రి గర్వంగా.

తెల్లవారింది. సోమవారం. భోజనం ముగించి తార అరగంట ముందుగానే పుస్తకాలపెట్టె పట్టుకొని ఆనందంగా స్కూలుకి నడిచింది ఇటువంటి పెట్టె క్లాసులో ఒక్క సులేఖకుమాత్రం ఉంది. తన పెట్టెను సులేఖకు చూపించాలి. తార వడివడిగా స్కూలుకి నడవసాగింది.

ఆనాటి సాయంత్రం నాలుగున్నర



"పుస్తకం క్రింద పడేశావు. ఇప్పుడు నేను చేసే వంట ఏదో ఎలాతెలుస్తుంది ?"

కల్లా తార ఇంటికి తిరిగి వచ్చింది. పాలు తాగి, హోమ్‌వర్కు చేయడానికి పుస్తకాలపెట్టె పట్టుకుని వరండా మీదకు వెళ్ళింది చాపమీద కూర్చుంది. "తాళం చెవుల గుత్తేదీ ?" అనుకుంటూ తార లోపల గదిలోకి పరుగెత్తింది. తన బట్టల పెట్టెను వెతికిచూసింది తాళం చెవులు దొరకలేదు. తొందరగా స్కూలుకు పరుగెత్తింది. తన క్లాసు రూమంతా గాలించింది నిస్పృహతో తార ఇంటికి తిరిగి వచ్చింది. గంటలు గడిచిపోతు న్నాయి. తాళం చెవులకోసం తార వెతుకుతూనే వుంది.

రాత్రి ఎనిమిదింటికి అందరూ భోజనాలకు కూర్చున్నారు. రామ్మూర్తి తార ఏదని అడిగాడు.

"పుస్తకాలపెట్టె తాళం చెవులు ఎక్కడో పారేసుకొంది. వాటికోసం సాయంత్రం నుంచీ వెతుకుతోంది.'' అంది కమల.

ఏడుస్తూ తార, గదిలో కొచ్చి తండ్రి కెదురుగా నిలబడింది.

"ఏమయింది తారా ?'' అడిగాడు రామ్మూర్తి.

"తాళంచెవులు కనిపించడంలేదు నాన్నా!" అని తార వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఏడిస్తే తాళంచెవులు వస్తాయా?"

"మాస్టారు హోమ్‌వర్క్ ఇచ్చారు. రాసి రేపు చూపించాలి. లేకపోతే తిడతారు పుస్తకాలన్నీ పెట్టెలో వున్నాయి."

"బెంగెందుకు! పెట్టె తాళాన్ని పగలగొట్టు!"

"అంత కష్టపడి కొనుక్కున్న పెట్టె పాడవుతుంది, నాన్నా..."

"పుస్తకాలు పెట్టెలో అలాగే వుండిపోతే నీ చదువు పాడవదూ?" అడిగాడు రామ్మూర్తి అడ్డొస్తూ

తార జవాబివ్వలేకపోయింది తండ్రివైపు దీనంగా చూసింది.

"తారా మొదట్లోనే నేను చెప్పాను, అలాంటి పెట్టెను కొనొద్దని. ఏ సంచిలోనో పుస్తకాలు పెట్టుకుంటే ఈ బాధనీకుండేదిగాదుగా? సంవత్సరంపైగా అన్నీ మానేసి, డబ్బు పోగుచేసి కొనుక్కున్న పెట్టె, తాళంచెవులు పోయేసరికి శనయి కూర్చుంది!" అన్నాడు రామ్మూర్తి గంభీరంగా.

రెండుమూడు రోజులపాటు రామ్మూర్తి ఆ పెట్టెకు సరిపడే తాళంచెవికోసం అన్వేషణ చేశాడు. ఎక్కడా దొరకలేదు. రామ్మూర్తి షాపు యజమానిని కలుసుకున్నాడు. బొంబాయిలోని కంపెనీకి రాసి తాళంచెవులు తెప్పించడానికి కనీసం నెలవుతుందన్నాడు. తాళంకప్పలు తెరిచి బాగుచేసేవాడికోసం ఎన్నిసార్లు కబురు పంపినా అతడు రాలేదు. దానితో రామ్మూర్తికి విసుగెత్తింది. ఒక సుత్తితో రామ్మూర్తి తాళంకప్పను పగలగొట్టాడు. పెట్టెలోని పుస్తకాలను తార ఆత్రంగా అందుకుంది. మెల్లిగా తార లోపలకు వెళ్ళిపోయింది

ఆరోజు రామ్మూర్తి బాల్కనీలో నిలబడి బైటకు చూస్తున్నాడు. పుస్తకాలను సంచిలో పెట్టుకుని మెల్లిగా స్కూలుకు వెళ్తున్న తారను చూసి అతను తనలో తాను నవ్వుకున్నాడు.

తారలాగే మానవులు అనేకవాటికోసం తపించి, శ్రమపడి కోర్కెలను తీర్చుకుంటారు. కాని అందుబాటులో లేనిది అందేసరికి ఏదో కొరతా, అసంతృప్తీ మానవుల మనస్సుల్లో తలెత్తుతూవుంటాయి.